




# మహారాష్ట్ర వడ్లు.. మంచిర్యాలలో కొనుగోలు

- పొరుగు రాష్ట్రం నుంచి రాత్రివేళలో అక్రమంగా ధాన్యం డంపింగ్
- కోటపల్లి గుండా చెన్నూర్ కు తరలింపు
- కత్తరసాల పీఏసీఎస్ కేంద్రంలో వెలుగు చూసిన దళారుల దందా
- స్థానిక రైతుల పేరిట కొనుగోళ్లు
- రెండ్ హ్యాండెడ్ గా పట్టుకున్న కత్తెరసాల రైతులు
- చెన్నూర్ పోలీస్ స్టేషన్‌లో లారీ అప్పగింత




**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

మంచిర్యాల జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో అధికారులు, అధికార పార్టీ నాయకులు స్థానిక రైతులను ఎలా ఇబ్బందులకు గురి చేస్తున్నారో ఈ సంఘటన తేటతెల్లం చేస్తున్నది. మంచిర్యాల జిల్లాలో నెల రోజుల పైగా వడ్ల కొనుగోళ్లు సాగుతున్నాయి. ఒక్కో కేంద్రంలో దాదాపు 20 రోజులకు పైగా స్థానిక రైతుల వడ్లు అలాగే ఉంటున్నాయి. అధికారులను అడిగితే లారీల కొరత, హమాలీ కొరతతో పాటు కేటాయించిన మిల్లుల్లో అన్ లోడింగ్ కు హమాలీల కొరత అంటూ సాకులు చెబుతున్నారు. కానీ వాస్తవ పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి.

జిల్లాకు పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి కొందరు దళారులు వడ్లను కోటపల్లి మండలం గుండా చెన్నూర్ మండలానికి తరలిస్తున్నారు. స్థానిక రైతుల వడ్లుగా చూపుతూ ఇక్కడి కొనుగోలు కేంద్రంలో విక్రయిస్తున్నారు. ఈ అక్రమ దందాకు అటు అధికారులు, ఇటు అధికార పార్టీ నాయకులు అండగా ఉన్నారని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. పక్క రాష్ట్రం నుంచి తెచ్చిన వడ్లను ఇక్కడి కేంద్రాల్లో కొనుగోలు చేస్తున్నారు. దీంతో స్థానిక రైతుల వడ్లు కొనుగోలు కేంద్రాల్లో దాదాపు 15 నుంచి 20 రోజులకు పైగా అలాగే ఉండిపోతున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలు రైతులను కలవరపెడుతున్నాయి. వర్షాలు వడ్లు కొనుగోలు కేంద్రాల్లోనే మొలకెత్తుతుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

**స్థానిక రైతులకు అన్యాయం**

మహారాష్ట్ర నుంచి వడ్లు తీసుకొచ్చి జిల్లా సరిహద్దు మండలాలైన కోటపల్లి, చెన్నూర్ మండలాల్లో విక్రయిస్తుండడంతో స్థానిక రైతులకు అన్యాయం జరుగుతున్నది. కొందరు అధికారులు, అధికార పార్టీ నాయకుల ధన దాహం మూలంగా స్థానిక రైతులు నష్టపోతున్నారు. 20 రోజులవుతున్నా తమ వడ్లు కొంటలేరు అని రైతులు వాపోతున్నారు. ఇటీవల ధాన్యం కొనుగోలులో జాప్యంపై మీడియాలో కథనాలు వస్తుండడంతో అధికారులు ఆయా కేంద్రాలకు వెళ్లి పరిశీలిస్తున్నారు. ముందస్తుగా అధికారుల పర్య టన సమాచారం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ఇస్తున్నారు. ఆయా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులను మేనేజ్ చేస్తున్నారు. కొనుగోళ్లు సజావుగా సాగుతున్నాయని రైతులతో చెప్పిస్తున్నారు. అటు అధికారులు, ఇటు అధికార పార్టీ నాయకుల కుయుక్తులు తెలియని అమాయక రైతులు షరా మామూలుగానే మోసపోతున్నారు.

**ఇదే ప్రత్యక్ష సాక్ష్యం**

మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం కత్తరశాల గ్రామంలోని వడ్ల కొనుగోలు కేంద్రానికి శనివారం అర్ధరాత్రి దాటాక ఓ లారీ వచ్చింది. అందులోకి ఓ బొలెరో వాహనాల నుంచి వడ్ల బస్తాలను లారీలో లోడ్ చేస్తుండగా స్థానిక రైతులు గుర్తించారు. రైతులను చూసి డ్రైవర్ సెంటర్ నుంచి లారీని సెంటర్ నుంచి తీసుకెళ్తుండగా స్థానిక రైతులు వెంబడించి పట్టుకున్నారు. చెన్నూర్ పోలీస్ స్టేషన్ లో లారీని అప్పగించారు. ఈ సందర్భంగా సదరు రైతులు మాట్లాడుతూ ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడితో పాటు మరికొందరు కలిసి అక్రమంగా వడ్ల దందా చేస్తున్నారని ఆరోపించారు. పొరుగున ఉన్న మహారాష్ట్రలో నుంచి రూ.1800 నుంచి 1900 వరకు వడ్లు కొనుగోలు చేసి ఇక్కడికి తీసుకవస్తున్నారని ఆరోపించారు. స్థానిక రైతుల పేరిట కొనుగోలు కేంద్రంలో విక్రయిస్తున్నారని ఆరోపించారు. 20 రోజులుగా మా వడ్లు ఎందుకు కొనడం లేదని ప్రశ్నించారు. అర్ధరాత్రి దాటాక కొనుగోలు కేంద్రానికి లారీలో ధాన్యం ఎలా నింపారని ప్రశ్నించారు. అధికారులు, అధికార పార్టీ నాయకుల అండతోనే వడ్ల దందా చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ నెల 27 దాకా వర్షాలు ఉన్నాయంటున్నారని, ఇప్పటికే 20 రోజులుగా కొనుగోలు కేంద్రంలో ఉన్న వడ్లను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఆరుగాల శ్రమించి పంటలు సాగు చేస్తున్న రైతులను దళారుల దందాకు బలి చేయొద్దని జిల్లా కలెక్టర్‌ను, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని కోరుతున్నారు.

ఈ విషయమై జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావును వివరణ కోరగా రైతులు లారీని పట్టుకున్న విషయం తన దృష్టికి రాలేదని, తెలుసుకొని చెబుతానని తెలిపారు. కాగా జిల్లా అదనపు కలెక్టర్ ను శెనార్తి మీడియా ఫోన్ లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.





# దివాకర్ రావు ఆరోపణలు అవాస్తవం

**మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు**



**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

ఇండస్ట్రియ ల్ పార్కు, ఐటీ హబ్ లో రూ.200కోట్లు లబ్ధిపొందుతూ, భూములు ఇచ్చిన వారికి మాత్రం రూ.13.50 లక్షల పరిహారం ఇస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు చేసిన ఆరోపణలు సత్యదూరమని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఆదివారం ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు తన 20 ఏళ్ల పాలనలో చేసిన అభివృద్ధి ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ రంగ సంస్థలు భూములను సేకరించి, వాటికి పరిహారంగా డబ్బులతో పాటు, లేఔట్ చేసి 241 ప్లాట్లతో ఇంటి స్థలం ఇచ్చి, ఇంటిని నిర్మించడంతో పాటు, 152మందికి ఉద్యోగం కూడా ఇస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గాన్ని విద్య, వైద్య రంగంలో రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలి పేందుకు కృషి చేస్తున్నానని స్పష్టం చేశారు. ఇండ స్ట్రియల్ పార్కు కోసం సేకరించే భూమి అసైన్డ్ భూమని, ఆ భూమి కోల్పోతున్న వారికి నష్టప రిహారం ఇస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే వచ్చే నెల 6 తరువాత తనతో చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. బీజేపీ అభ్యర్థి రఘునాథ్‌కు ఈ ప్రాంతంపై అవగాహన లేదన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వమే ఉందని, ఇక్కడి బీజేపీ నాయకుడు కేంద్రంతో మాట్లాడి, ఐబీ నుంచి బసంత్ నగర్‌కు స్కైవే తెప్పించేలా చూడాలని, తాను ఢిల్లీకి వచ్చి కేంద్ర మంత్రులతో మాట్లాడతానన్నారు. స్కైవేకు రాష్ట్రం నుంచి 10శాతం నిధులు కేటాయించేలా చూస్తానని, కేంద్రం నుంచి 90 శాతం నిధులు ఇప్పిస్తారా అని ప్రశ్నించారు. వరుసగా రెండో ఏడాది వేసవికాలంలో తాగునీటికి సమస్య లేకుండా చేశానని, తాను చేపడుతున్న అభివృద్ధి పనులు రెండు నుంచి మూడేళ్లలోపు పూర్తవుతాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నిం టిని నెరవేర్చానని, 50ఏళ్లకు సరిపడే అభివృద్ధి పనులను తాను చేపడుతుంటే, ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి, భయంతో నే అసత్యపు మాటలతో బీఆర్ఎస్, బీజేపీ నేతలు పబ్బం గడుపుతున్నారన్నారు. ఎవరెన్ని మాటల న్నా విద్య, వైద్యంను ప్రజలకు అందించేందుకు పని చేస్తానని స్పష్టం చేశారు. అనంతరం సీనియర్ జర్నలిస్టు మునీర్ మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు.

# పుష్కరస్నానానికి పోటెత్తిన భక్తులు

**నార్తి మీడియా, మహాదేవ్ పూర్**

జయశంకర్ జిల్లా మహాదేవ్‌పూర్ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమంలో సరస్వతీ నది పుష్కరాలు సోమవారంతో ముగియనున్న నేపథ్యంలో భక్తుల రద్దీ అధికమైంది. గోదావరి, ప్రాణహిత, సరస్వతీ సంగమంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. చివరి రోజులు కావడంతో కాళేశ్వరం ప్రాంతం భక్తులతో కిటకిటలాడుతోంది. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ సహా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తుల రాకతో ట్రాఫిక్ స్తంభిం చింది. మహదేవ్‌పూర్–కాళేశ్వరం మార్గంలో 17 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. భారీ వర్షాలకు రహదారులు బురదమయమై, వాహనాలు దిగబడుతున్న పరిస్థితి నెల కొంది. అధికారులు, పోలీసులు పరిస్థితిని నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

**పుణ్య స్నానం చేసిన మాజీ కార్పొరేటర్**

**శెనార్తి మీడియా, చిగురుమామిడి:** సరస్వతి నది పుష్కరాల్లో చిగురుమామిడి మండల కేంద్రానికి చెందిన యూసఫ్



గూడ మాజీ కార్పొరేటర్ గుర్రం మురళి గౌడ్ కమల దంపతులు ఆదివారం పుణ్య స్నానం ఆచరించారు. నదిలో పలు రకాల ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు చెప్పారు.ఈ సందర్భంగా మురళి గౌడ్ దంపతులు మాట్లాడుతూ సరస్వతి నది పుష్కరాల పవిత్రతను కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని మురళి గౌడ్ పేర్కొన్నారు.కాలేశ్వరంలో సరస్వతీ నది పుష్కరాల సందర్భంగా ప్రభుత్వం చేసిన ఏర్పాట్లను అభినందించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజలు సరస్వతి నది పుష్కరాల సందర్భంగా తరలివచ్చారని సంతోషం వ్యక్తం చేశారు.





# సీనియర్ జర్నలిస్ట్ మునీర్ కు నివాళి

**అంత్యక్రియలకు హాజరైన ప్రజాప్రతినిధులు, నాయకులు, జర్నలిస్టులు**

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

సీనియర్ పాత్రికేయుడు, తెలంగాణ ఉద్యమకారుడు మునీర్ పాషా హఠాన్మరణం చెందగా ఆదివారం అంత్యక్రియలు జరిపారు. జిల్లాలోని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు తరలివచ్చి ఆయన పార్థివ దేహం శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ, మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, బీఆర్ఎస్ యువనాయకుడు విజిత్ కుమార్ నివాళులర్పించారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. మునీర్ జీవితమంతా పత్రికా రంగం , తెలంగాణ ఉద్యమంలోనూ విశేషమైన సేవలతో గడిచిందని గుర్తు చేసుకున్నారు. కలం యోధుడిగా, అణగారిన వర్గాల సమస్యలను ప్రపంచానికి తెలియజేసే గొంతుగా నిలిచారని పేర్కొన్నారు.. ఆయన మృతి చాలా పెద్ద నష్టం అని అన్నారు. నడిపెల్లి విజిత్ కుమార్ పేర్కొంటూ, తెలంగాణ ఉద్యమానికి ఆయన అందించిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయి. ఆయన కలం సమాజ మార్పుకు స్ఫూర్తినిచ్చింది, అని అన్నారు. మునీర్ కుటుంబానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని, ఆయన చూపించిన మార్గంలో ముందుకు సాగాలన్నారు.

## పరామర్శ

**శెనార్తి మీడియా, గన్నేరువరం:** గునుకుల కొండాపూర్ కు చెందిన న్యాలపట్ల వెంకవ్వ ఇటీవల మృతి చెందగా ఆదివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కొమ్మెర రవీందర్ రెడ్డి, మండల అధ్యక్షులు ముసుకు ఉపేందర్ రెడ్డిలు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారి నాయకులు తాళ్లపల్లి రవికుమార్ గౌడ్, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్,హన్మాండ్ల నర్సయ్య, దొమ్మటి మల్లయ్య, న్యాలపట్ల లక్ష్మణ్ గౌడ్, న్యాలపట్ల రమేష్ గౌడ్, మహమ్మద్ రహీం, వడ్నాల ప్రవీణ్, కిరణ్,విష్ణు పాల్గొన్నారు.



# ఉస్మానియాకు సింగరేణి సహకారం

**శెనార్తి మీడియా, హైదరాబాద్/మంచిర్యాల:**



ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధి లక్ష్యంగా సింగరేణి సిఎస్ఆర్ నిధులతో నిర్మించిన తరగతి గదుల కాంప్లెక్స్‌ను ఆదివా రం యూనివర్సిటీ ప్రాంగణంలో ప్రారంభించారు. సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్, ఉస్మానియా యూనివర్సిటీ ఉప కులపతి కుమార్ మొగులారం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

**తెలంగాణ విద్యాభివృద్ధికి సింగరేణి సహకారం..**

ఈ సందర్భంగా బలరామ్ మాట్లాడుతూ.. ఉస్మానియా వంటి అంతర్జాతీయ ఖ్యాతి కలిగిన విశ్వవిద్యాలయం అభివృద్ధికి తోడ్పడటం సింగరేణి సంస్థకు గర్వకారణం. విద్యా రంగంలో సమగ్ర అభివృద్ధికి మేము ఎప్పుడూ సిద్ధంగా ఉంటాం అని తెలిపారు. సుమారు రూ.2 కోట్ల వ్యయంతో సీఎస్ఆర్ నిధుల ద్వారా ఈ తరగతి గదులను నిర్మించామని పేర్కొన్నారు.

**మైనింగ్ విద్యలో పురోగతి..**



సింగరేణి తరఫున మైనింగ్ ఇంజినీరింగ్ విభాగ అభివృద్ధి కోసం అధ్యాపకుల నియామకం, ప్రొఫెసర్ చైర్ నిధుల కేటాయింపు చేపట్టామని బలరామ్ వివరించారు. రాష్ట్రంలో విద్యా రంగంలో సింగరేణి చేస్తున్న కృషి అనితరసాధ్యమని, మంచి మౌలిక సదుపాయాలు అందించేం దుకు కృషి చేస్తామని చెప్పారు.

**ఉస్మానియా ఉపకులపతి ప్రశంసలు..**

ఉస్మానియా యూనివర్సిటీ ఉపకులపతి మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ అందిస్తున్న సహాయం విశ్వవిద్యాలయ అభివృద్ధికి మైలురాయిగా నిలుస్తుంది. విద్యా రంగంలో సింగరేణి స్ఫూర్తిదాయక పాత్ర పోషిస్తోంది అని ప్రశంసించారు. ఉస్మానియాకు సింగరేణి అందించిన ఈ సహకారం, విద్యాభివృద్ధి ప్రయాణంలో కొత్త పుంతలు తొక్కేలా చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ నరేశ్ రెడ్డి, ప్రిన్సిపల్ చంద్రశేఖర్, ఈసీఈ విభాగాధిపతి రామకృష్ణ, సింగరేణి అధికారులు భాస్కర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.